
# లేఖల కలకలం

- పోలీసుశాఖ పోస్టింగుల్లో గందరగోళం..
- ఇవాళ పోస్టింగ్.. రేపు ఊస్టింగ్..
- కొత్త పోస్టులో చేరకముందే.. ట్రాన్స్ ఫర్ అయినట్లు మరో మెసేజ్..
- ఎమ్మెల్యేల సిఫారసు లేఖ ఉన్నవారికి అందలం..
- వివాదాస్పద అధికారులకు మంచి పోస్టింగ్
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందలమెక్కిన వారికే మళ్లీ మంచి అవకాశం..
- పారదర్శకత లేదంటున్న పలువురు అధికారులు..
- ఎన్ని రోజులు లూప్ లైన్ లోనే ఉండాలని అసహనం..
- కాంగ్రెస్ కార్యకర్తలపై కేసుల పెట్టిన వారికీ పోస్టింగ్ ఇవ్వడంపై ఆగ్రహం..
- ఉమ్మడి జిల్లాలో పోలీసుల బదిలీల్లో చిత్రవిచిత్రాలు

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి : పోలీసుశాఖలో అధికారుల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారింది. గతంలో ఎప్పుడూ లేని విధానాలు పోస్టింగ్ ల్లో అమలవుతున్నాయి. బదిలీ ఉత్తర్వులు చేతికొచ్చినా.. కొత్త పోస్టింగ్ లో చేరేలోపే.. బదిలీ అయినట్లు మరో మెసేజ్ రావడం కలకలం సృష్టిస్తున్నది. ఇవ్వాళ పోస్టింగ్.. రేపు ఊస్టింగ్ అన్నట్లుగా ఉంది పోలీసు శాఖలో బదిలీల వ్యవహారం. అంతేకాదు, ఇక్కడ మరో ట్విస్ట్ కూడా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొమ్ముకాసిన, కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టిన అధికారులకూ మంచి పోస్టింగ్ లు రావడంతో ఆ పార్టీ కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వారి బదిలీకి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, కొన్నేళ్లుగా లూప్ లైన్ లో ఉన్నతమకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి పోస్టింగ్ వస్తుందని భావించినా.. మళ్లీ అదే పరిస్థితి నెలకొందని ఆ శాఖకు చెందిన పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ట్రాక్ రికార్డు చూసి పోస్టింగ్ కేటాయించాలని కోరుతున్నారు.



### మళ్లీ వారికే అందలం..

ప్రభుత్వ అధికారుల బదిలీ విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలి. కానీ, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లు నియోజకవర్గ ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఉన్న పోలీసు అధికారులకే పోస్టింగ్ ఇచ్చేవారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఫాలో అయ్యింది. గతంలో మంచి పోస్టింగ్ చేసిన కొందరు అధికారులకు తాజాగా జరిగిన బదిలీల్లో పెద్దపీట వేయడం చర్చానీయాంశంగా మారింది. అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా ఎమ్మెల్యే పైరవీ లేకుండా ఉన్న అధికారులు పదేళ్లపాటు లూప్ లైన్లోనే ఉన్నారు. డబ్బులు పెట్టి పోస్టింగ్ తెచ్చకొని ప్రజలను దోచుకోవడం ఎందుకని కొంత విలువలు పాటించినవారు మాత్రం లూప్ లైన్ లోనే ఉన్నారు. ఎమ్మెల్యే సిఫారస్ లేఖలు తెచ్చుకునే స్థోమత ఉన్నా.. ఆ పని చేయలేదు. అయితే, వారికి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మంచి పోస్టింగ్ వస్తుందని భావించినా వారి ఆశలు అడియాశలు అయ్యాయి. మళ్లీ ఇటీవల జరిగిన బదిలీల్లోనే మొండి 'చేయి'చూపడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్యేల సిఫారసు ఉన్నవారికే పోస్టింగ్..

పోలీసు శాఖలో రెండు, మూడు రోజులుగా సీఐలు, డీస్పీలు, ఏసీపీల బదిలీలు జోరుగా జరిగాయి. ఈ బదిలీ ప్రక్రియలో చిత్రవిచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు ఉన్నవారికి పోస్టింగ్ ఇవ్వగా.. ఇందులో ట్విస్ట్ లమీదు ట్విస్ట్ లు ఉన్నాయి.
బదిలీ అయినట్లు ఆర్డర్ కాఫీ చేతికొచ్చినా.. పోస్టింగ్ లో చేరేవరకు నమ్మకం లేకుండా పోతున్నది. కొత్త పోస్ట్ లో ఛార్జ్ తీసుకునే లోపే బదిలీ అంటూ మరో మెసేజ్ వస్తుంది. అయితే, కొంత మందికి ఎమ్మెల్యేలు సిఫారస్సు లేఖలతో పోస్టింగ్ లు తెచ్చకున్నారు. అయితే, కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులను పోస్టింగ్ చేరకుండా మంత్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఆ పోస్టును వెయిటింగ్ లో పెట్టడం ఇప్పుడు ఆ శాఖలో హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇన్ స్పెక్టర్లుగా పోస్టింగ్ లు పొందినవారు లూప్ లైన్ లో పనిచేయకుండానే పోస్టింగ్ కొట్టేయడం కొందరు సీనియర్ అధికారులు మింగుడు పడటం లేదు. ఒక పోలీసు అధికారి ఎస్ఐ నుంచి ఇన్ స్పెక్టర్ గా పదోన్నతి పొందిన తర్వాత కనీసం 3ఏళ్ల పాటు లూప్ లైన్ లో పనిచేసి ఉండాలి. కానీ, ప్రజాప్రతినిధులు వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకుని పోస్టింగ్ లు పొందుతున్నారు.

### మచ్చుకు కొన్ని బదిలీలు..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ ఏసీపీ కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులు గురి చేశారు. మళ్లీ ఆయనకే ఇటీవల జరిగిన బదిలీల్లో మంచి పోస్టింగ్ వచ్చింది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి అవుట్ రైట్ గా పనిచేశారు. కాంగ్రెస్ తరపున పోటీచేసిన అభ్యర్థికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ఆ అధికారిపై ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశారు. అయితే, ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓ ఎమ్మెల్యే తో మంచి సంబంధాలు ఉండటంతో ఆయన సిఫారసు లేఖతో మంచి పోస్టింగ్ కొట్టేశారు. ఇది ఆ నియోజకవర్గ కాంగ్రెస్ నేత, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆయన బదిలీ రద్దు చేయించాలని ప్రయత్నం చేస్తున్నారు.

– ఖమ్మంలో పనిచేసిన ఇన్ స్పెక్టర్ శ్రీధర్ కు వరంగల్ కమిషనర్ పరిధిలోని కేయూసీ పోలీస్ స్టేషన్లో పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఆయన ఖమ్మంలో పనిచేసిన సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, అక్రమ కేసులు పెట్టారనే ఆరోపణాలున్నాయి. అయితే, ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సిఫారసుతో కేయూసీలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈ విషయం తెలిసిన ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి పోలీసు ఉన్నతాధికారికి ఫోన్ చేసి ఆ అధికారి జైయిన్ కావొద్దని చెప్పాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులకు ఆయనకు ఫోన్ చేసి జైయిన్ కావొద్దని, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వెయింటింగ్ ఉండాలని సూచించారు.

– కేయూ పోలీస్ స్టేషన్ నుంచి పరకాలకు బదిలీపై వెళ్లిన ఎం. అబ్బయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్లే కొన్ని అనివార్య కారణాల వల్ల నిలిపి వేశారు. విధుల్లో చేరి రెండు రోజులు కాకముందే సీపీకి (వీఆర్) అటాచ్ చేయడం చర్చానీయాంశంగా మారింది. ప్రస్తుతం పరకాల, కేయూ పోలీస్ స్టేషన్లకు త్వరలోనే ఇన్ స్పెక్టర్లను నియమించే అవకాశం ఉంది.

– మహబూబాబాద్ జిల్లాలోని ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో గందరగోళం నెలకొంది. జిల్లాలోని 9మంది సీఐలను ట్రాన్స్ఫర్ చేయగా.. ఐదు పోలీస్ స్టేషన్లకు కేటాయించిన సీఐలను కొత్త ప్లేస్ లో చార్జ్ తీసుకోకముందే ట్రాన్స్ ఫర్ ఆర్డర్ రద్దు చేశారు. అయితే రివైజ్డ్ కాపీని మొదట బహిర్గతం చేయకుండా ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆ తర్వాత అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

### ఇంటెలిజెన్స్ పరిశీలించినా..

పోస్టింగ్ ల విషయంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఏసీపీలు, డీఎస్ పీలు, సీఐల ట్రాక్ రికార్డు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీని ఆధారంగా కొంత మందికి లూప్ లైన్ పోస్గింగ్ లు ఇచ్చారు. అయినప్పటికీ కొందరు సిఫారసు లేఖలు బలంగా పనిచేయడంతో తప్పని పరిస్థితుల్లో వారికి పోస్టింగ్ ఇచ్చారు. అయితే, పోస్టింగ్ లకు కూడా గ్యారెంటీ లేదు. ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను తృప్తి పరిచేందుకు కొద్ది రోజులు తమ పోస్టింగ్ లు కొనసాగించాలని తెలిపినట్లు తెలుస్తోంది. తర్వాత అధికారుల పూర్తి ట్రాక్ రికార్డు బయటకు తీసి వారిపై అవసరమైతే చర్యలు తీసుకోవడం.. లేదంటే లూప్ లైన్ లోకి పంచించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం

# ముగిసిన ఈవీఎంల తనిఖీ

**అక్షర దర్బార్, హనుమకొండ:** హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంల గోదాం వద్ద ఈనెల 5 నుంచి ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల గోదాం వద్ద ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ అనంతరం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టిన మాక్ పోలింగును హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. మాక్ పోలింగ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ వాటి వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాక్ పోలింగ్ లో నిష్పత్తి ప్రకారం 500 ఓట్లకు గాను 13 ఈవీఎంలను, వెయ్యి ఓట్లకు గాను 13 ఈవీఎంలను, 1200 ఓట్లకు గాను 7 ఈవీఎంలను, మొత్తంగా మాక్ పోలింగ్ లో 33 ఈవీఎంలను వినియోగించారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్ లో హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్లు వేయించారు. మాక్ పోలింగ్ లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ రిజల్ట్, వివి ప్యాట్ల స్లిప్పులను లెక్కించి సరి సమానంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. మాక్ పోల్, లెక్కింపు , సరైన నిర్ధారణ అనంతరం సాయంత్రం ఈవీఎంలను పోలీస్ భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్ కు తరలించి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ సమక్షంలో అధికారులు సీల్ వేశారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలలో 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎఫ్ఎల్సీ ప్రక్రియలో 713 బ్యాలెట్ యూనిట్లు, 627 కంట్రోల్ యూనిట్లు, 757 వీవీ ప్యాట్లను ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ధ్రువీకరించింది. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, హనుమకొండ ఆర్డీవో రమేష్, తహసీల్దార్లు బావ్ సింగ్, నాగరాజు, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్లు సంతోష్, రామకృష్ణ, విఠలేశ్వర్, శ్యామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇవీ శ్రీనివాస్ రావు, రాంప్రసాద్, రజనీకాంత్, మణి, ఎస్.కె. పాషా, ప్రవీణ్ కుమార్, ఎండీ. ఫైజుల్లా, శ్యామ్, ఈసీఐఎల్ ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ పోలింగ్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్